గాలిపాటు

౧

నేను బీదకుటుంబములో పుట్టి పెరిగినవాడ నైనప్పటికీ ఉన్నతవిద్యలు పొందనివాడ నైనప్పటికీ, ఒక్కమారు హఠాత్తుగా లక్షాధికారిని కావడముకు కారణ మేమో ఒక రిద్దరికితప్ప మరెవరికి తెలియదు. అంతే కాకుండా నేను ఏకుటుంబమునైతే దూషించేవాడనో ఆకుటుంబములో పుట్టినకన్యకను వివాహముచేసుకొని సుఖంగా కాపురం చేస్తూవుండడంకూడా ప్రజలకు వింతగానే వుంది. కాని దానికారణంకూడా యెవరికి తెలియదు. దీని కంతకూ పెద్దగాధ వున్నది. చెప్పుతా వినండి.

వేసవికాలం ఒకనాటిమధ్యాహ్నం వూసుపోక మా ముత్తాతగారి వ్రాతప్రతు లుంచినతాటాకుపెట్టె ముందర వేసుకొని కాలక్షేపం చెయ్య తలుచుకున్నాను. మా ముత్తాతగారిపేరు లోకంలో మోగిపోయింది. వ్యాకరణంలో అంతవారు లేరనీ యిక వుండరనీ నేటికికూడా చెప్పుకోవడం కద్దు. వారు పన్నెండోయేట చదువుకునే వూహతో కాశీ లేచిపోయినారట. అక్కడ పదిహేను సంవత్సరాలపాటు విద్య సాంతంగా గ్రహించి యింటికి

తిరిగివచ్చినారట. ఇప్పటికికూడా మామునలమ్మ చెప్తూవుంటుంది. వచ్చేటప్పుడు రెండుగుర్రాలమీద శాలువలూ, పట్టుబట్టలూ ధనమూ తీసుకొని వచ్చినారట. ఇప్పుడెందుకు ఆగోడవంతా! ఆరోజులు వెళ్లేయి. ఆరోజుల్లో మాకుటుంబం చాలా ఉచ్చగా వుండేదిట. అన్నట్టు అసలుసంగతి చెప్పడం మరచిపోయాను. రాయడం ఎప్పుడూ అలవాటు లేక ముందుసంగతి వెనకా వెనకసంగతి ముందూ చెప్పుతూవుంటాను, కొంచెం క్షమించండి!

ఇప్పుడున్నట్టు మాముత్తాతగారిరోజుల్లో ఈతిబాధలు లేకుండా వున్నవని అనుకుంటున్నారేమో, అలా అనుకోవడం చాలా పొరపాటు. అవి దండులు గావు, అవి పితూరీలు కావు, అవి గత్తరలు కావుట! మాముసలమ్మ చెప్పుతూవుంటుంది.

కాశీనుంచి వచ్చేటప్పుడు మాముత్తాతగారు ఎంతో డబ్బు కూడా తెచ్చారట. ఎంతడబ్బు తెచ్చారు, ఏ రూపంగా తెచ్చారు అనేసంగతులు ఎవరికీ తెలియవు. ఈధనమంతా ఆయన భోషాణంలో పెట్టి ఆభోషాణం మీదనే పండుకొనేవాడట. ఇంకా ఆభోషాణం మాయింట్లో వుంది.

ఇలా వుండగా ఒకనాడు వూళ్ళో పుకారు పుట్టింది

రాఘవరాజు గత్తర వస్తోందని. రాఘవరాజు అనే క్షత్రియుడు కొంత దండు సమకూర్చి గ్రామాలలోకి రావడం ప్రతిగృహస్థు దగ్గరకూ వెళ్ళి అడిగి ధనము పుచ్చుకోవడమూ, ఇవ్వకపోతే ఇళ్ళు తగలబెట్టి గ్రామాలు దోచుకుపోవడం చేసేవాడట. ఇదే రాఘవరాజు గత్తర అంటేను. ఈవదంతి వూళ్ళో వ్యాపించడంతోనే వూరివారందరికీ పైప్రాణాలు పైకి పోయినవి. డబ్బు లేనివాళ్ళకు ఏవిచారం లేదు, డబ్బున్న వాళ్ళు తమడబ్బు దాచుకోవడమునకు అనేకప్రయత్నాలు చేశారు. గాదెలకింద దాచుకునేవాళ్ళు కొందరు, గాదెల్లో దాచుకునే వారు కొందురూ, తోటల్లోనూ దొడ్లల్లోనూ దాచుకునేవాళ్ళు కొందరూ, నూతుల్లో దాచుకొనేవారు కొందరూ ఇలాగ్గా అనేకవిధాలుగా ప్రజలు తమధనం ధాచుకోవడం మొదలు పెట్టినారు.

మామ్మత్తాతగారుకూడా తమడబ్బు ఎక్కడో దాచారుట, ఎక్కడ దాచారో ఎవరికీ తెలియదు. దాచినచోటు ఆయన ఏకారణంచేతనో ఎవరితోనూ చెప్పలేదు.

తరువాత రాఘవరాజుగత్తర ఆవూళ్ళో జరిగిందిట. కొంపలు తగలబెట్టడం, ఇళ్ళల్లో మిగిలిసొమ్ము దోచుకోవడం ఇత్యాది జరగవలసినలాంఛనాలు జరిగినవి.

అసలు చెప్పతలచుకొన్న విషయం మరచి ఏమిటో చెప్పుతున్నాను. ఒకనాడు వేసవికాలంలో పుస్తకాల పెట్టె దగ్గిర పెట్టుకున్నాను. పుస్తకాలు తిరగవెయ్యడం మొదలుపెట్టాను. కొన్ని తాటాకుపుస్తకాలు, కొన్ని కాకితాలపుస్తకాలు, కొన్ని భూర్జపత్రాలు. ఒక కాకితాలపుస్తకం తీసి పైన చుట్టినగుడ్డ విప్పినాను. ఇటూ అటూ కర్రపలకలు పెట్టి మధ్యను కాకితాలు పెట్టి వున్నవి. ఒకకాకితం తరువాత ఒకకాకితం తిరగవేశాను. ఒక్కముక్క అర్థం కావడం లేదు. అంతా తెనుగులిపి. కాని అది చదవడం నాకు కష్టమనిపించింది. అది యిలా తిరగవేస్తూంటే మధ్యను ఒకభూర్జపత్రం అవుపించింది. పత్రము చేతితో పట్టుకొని దానిలో ఏమి రాసివున్నదో చదువవలె ననుకొన్నాను. లిపి తెలుగే. భాష సంస్కృతం కాదు, తెనుగూ కాదు. ఇటూ అటూ తిప్పినాను.

వెనుకవేపున 'నిధికిదారి' అని వున్నది. నిధి అని చదవడంతోనే మాముత్తాతగారు దాచిన ధనం జ్ఞాపకం వచ్చింది.

ఈపత్రం నిధికి నిజంగా దారి చూపిస్తుంది కాబోలు అనుకున్నాను. అనుకోవడం కొంతసేపటికి గట్టినమ్మకములోకి దిగింది. ఆభాష ఏమిటో తెలుసుకొందా

మనీ, దానిలో కిటుకు తీద్దామనీ దృఢసంకల్పం చేసు కున్నాను.

అయితే ఇది రహస్యంగా వుంచవలసిన విషయం నలుగురినీ అడిగి ఎలాగ వెల్లడి చెయ్యగలను అనుకు న్నాను. భూర్జపత్రం పైకి తీసి పుస్తకం కట్టిపెట్టి, పె ట్టెలో పెట్టి అంతా సర్ది అంగవస్త్రం బుజంమీద వే సుకొని భూర్జపత్రం పట్టుకొని వూరికి కొంచెం దూ రంలో వున్న దేవుడుగుళ్ళోకి వెళ్ళాను. అక్కడ ఏమి చెయ్యవలెనో ఆలోచించవలె ననివూహ.

దేవాలయానికి వెళ్ళి పత్రం కేసి చూసిచూసి ఎం తో ఆలోచించాను. ఏమీ పాలుపోయింది కాదు. దే వుడికి వెయ్యికొబ్బరికాయ కొట్టిస్తా నన్నాను. గంధ వత్తులదీపారాధన చేయిస్తా నన్నాను, దాల్లోకిటుకు దొ రికి నిధి దొరికితేను. ఊఁహు. ఏమీ తోచింది గాదు. ఇంక ఇంటికి లేచిపోదా మని అనుకుంటూంటే మంచి వూహ స్ఫురించింది. విశాఖపట్టణంలో చాలా పేరుప్ర తిష్ఠలు సంపాదించి కుశాగ్రబుద్ధి కలవాడని తెలుగు దేశంలో పేరుపొందిన "విశ్వనాథం" గారిని అడిగితే సర్వమూ విశదము కావచ్చునని తోచింది. అయితే డబ్బుతో కూడిన వ్యవహారం గదా, ఆయనతో ఎలా చెప్పడం అనుకొన్నాను.

విశ్వనాథంగారు పరధనము తృణప్రాయంగా చూసే వా రని యిదివరలో పూర్ణ చంద్రుడి విషయంలో ఆయన పని చేసినప్పుడు లోకానికి తెలిసింది. అంతే కాకుండా ఆయన చాలా డబ్బు కలవాడు కదా అని సమాధానం చెప్పుకొని ఆరాత్రే బయలుదేరి విశాఖ పట్టణం వెళ్ళాను.

పడక కుర్చీలో పండుకొని నవల చదుకుంటున్నాడు విశ్వనాథం. నారాయణదాసు పక్క కుర్చీలో పడుకుని కునికిపాట్లు పడుతున్నాడు. నడవలో నిలబడి 'విశ్వనాథంగారూ' అని కేకవేశాను. దాసు ఉలికిపడి లేచినాడు. విశ్వనాథం 'దయచెయ్యండి' అన్నాడు. నేను గదిలో ప్రవేశించి కుర్చీమీద కూర్చున్నాను.

"తమరు దయచేసిన కారణం——"

"చిత్తం! మాది పిఠాపురం కాపురమండి. మా యింటిపేరు వూలపిల్లి వారు, నాపేరు నారాయణంటారు" అన్నాను.

"ఓహో! వూలపిల్లి నారాయణగారంటే మీరేనా! మీపేరు ఈమధ్యను విన్నాను. జ్ఞాపకం వుందా దాసు!" అన్నాడు విశ్వనాథం.

"జ్ఞాపకం లేకేమి! నిన్ననే కాదూ మనకు ఆసంగతి తెలుస్త!" అన్నాడు దాసు.

భూర్జపత్రంసంగతి నిన్ననే వీళ్ళకి ఎలా తెలిసింది చెప్మా, ఆవులిస్తే పేగులు లెక్కపెట్టేవాళ్ళవలె వున్నావే వీళ్ళు అనుకున్నాను.

"తమరు గొప్పవారు, నాపేరు నిన్న వినడం—

మరి ఏసందర్భాన—" అని ఏమో అనబోతూండగా విశ్వనాథం "అది వేరేసంగతి లెండి" అన్నాడు.

"ఇలాగ కాదండి, తమరు ఏసందర్భాన?" అనబోతూవున్నాను మళ్ళీ.

"సందర్భం మీకు కావాలా? అది ధనవిషయం" అన్నాడు విశ్వనాథం. నాగుండెల్లో రాయిపడింది. అన్నానుగదా—

"బీదవాడిని, ధనవిషయంలో నాపేరు వినడం ఎలా తటస్థించిందో తమకు?"

"అయితే పూర్తిగా చెప్పమన్నారా? మీవూళ్ళో గానుగవారున్నారు."

"చిత్తం. గానుగ రంగయ్యగారండి."

"ఆయనకు కూతురున్నదట కాదూ? స్ఫురద్రూపిట."

"చిత్తం."

"వారు చాలా బీదవారట కాదూ?"

"చిత్తం."

"పిల్లకు మంచిసంబంధం చేసి తన్మూలాన తాము కూడా లాభము పొంది వృద్ధిపొందవలెనని వూహించినారట కాదూ!"

"చిత్తం. అలాగే అనుకుంటున్నారండి."

"చూడండి, నారాయణగారూ! నాప్రశ్నలకు మీరు యథార్థంగా వుత్తరము చెప్పితే నాకు చాలా సంతోషంగా వుంటుంది. మీకార్యంకూడా చక్కవతేలుస్తాను."

"చిత్తం. తమయిష్టప్రకారం చెయ్యడానికి సంకల్పించుకున్నాను" అని అనక తీరిందికాదు. "మరి ఈమధ్యను ఆఅమ్మాయికి కాకినాడనుంచి సంబంధం వచ్చింది కాదూ!"

"చిత్తం. కాకినాడలో తవ్వల శేష శాస్త్రిగారు చాలాధనవంతులని ప్రతీతి. ఆయనకు మొదటిభార్య జారిపోయిందిట. ద్వితీయంకోసం ప్రయత్నం చెయ్యడంలో ఈసంబంధం కూడా చూచినారట."

"సరే! ఆసంబంధం పొసగలేదట. కారణం ఏమో!"

"చిత్తం! తమతో నిజం మనవి చేస్తాను. ఆపిల్లకు కొంచెం కళ్లు జబ్బని ఎవరో వదంతి పుట్టించారు. ఆకారణంచేత సంబంధం తిరిగిపోతుందని చెప్పుకున్నారు."

"నిజంగా ఆఅమ్మాయికి కళ్లు జబ్బా?"

"రామరామా! లేదండి. పట్టికల్లవార్త పుట్టించారు. పిల్ల తాౘ్రమ్మా తీగలా వుంటుందండీ. నే నెరుగుదును."

"నారాయణగారూ, నాకేసి సరిగ్గా చూడండి. మీరే కాదూ ఆపదంతి పుట్టిస్త!"

నానోటివెంట మాట వచ్చింది కాదు. పుట్టించిన మాట నిజమే కాని పెద్దమనిషి దగ్గిర ఎలాగ వొప్పుకోవడం?

"నిజం చెప్పండి. దానివల్ల మీకు అపకారం కలగదు, నేను వాగ్దత్తము చేస్తాను. చెప్పకపోతిరా మీ కార్యం నేను చూడలేను. మీరు సెలవు పుచ్చుకోవచ్చును."

ఇంతమట్టుకు వచ్చాక యింక సెలవు పుచ్చుకోవడం ఏలాగ? ఏమైనా సరే అని చెప్పడం మొదలుపెట్టాను.

"చిత్తం, తమవద్ద తప్పు వప్పుకోక తప్పదు. నేను బీదవాణ్ణి. తప్వాల శేష శాస్త్రుృగారి సంబంధం తమ కూతురికి తెచ్చిపెట్టితే రెండువందలరూపాయలు నాకు బహుమతీ యిస్తానని గొల్లప్రోలులో నూకల వెంకయ్యగారు నాకాళ్ళా వేళ్ళా బడ్డారు. అప్పుడు ఈపనికి పూనుకున్నాను నేను."

"శేషశాస్త్రిగారు వెంకయ్యగారి కూతుర్ని చేసుకున్నారా ?"

"చిత్తం. పిల్ల సలక్షణంగా వుంటుందండి. వెంకయ్యగారికి భూవసతికూడా చాలా వుందండి. ఆకారణం చేత వెంకయ్యగారి కూతుర్నే ఆయన చేసుకున్నారు."

"మీరు ఇలాగ కుట్ర చెయ్యడంమూలాన గానుగ రంగయ్యగారి కూతురికి తగినసంబంధాలు రావడం లేదనీ, వచ్చినసంబంధాలు తిరిగి పోతున్నవనీ ఆబ్రాహ్మడు ఈవూరు వచ్చి నిన్న మొరపెట్టుకున్నాడు పాపం! దానికి ఏమి శాస్తి?"

"తమరే ఏమి శాస్తి చెప్పితే దానికి వప్పుకుంటున్నాను."

"సరే, తమకార్యం సెలవియ్యండి." అప్పుడు నేను సందేహంతో దాసుగారికేసి చూశాను. విశ్వనాథం గ్రహించి "దాసు వున్నాడని మీరు సందేహించకండి. ఇతను మనవాడే" అన్నాడు.

అప్పుడు నేను భూర్జపత్రం తీసి విశ్వనాథంగారి చేతులో పెట్టి దానిపూర్వోత్తరాలు చెప్పినాను. విశ్వనాథం చాలాసేపు చేతులో వుంచుకొని నిదానించి చూచి ఆపత్రం దాసుచేతిలో పెట్టినాడు.

"దాసూ, విన్నావుటోయి, ఈభాష తెలిస్తే గొప్ప సంసారి అవుతాడు ఈబ్రాహ్మడు. ఏభాష అంటావు ఇది?" దాసు మాట్లాడలేదు.

"ఇది యేభాషా కాదు. తెనుగు" అని విశ్వనాథం అన్నాడు.

తెనుగా! అని దాసూ నేనూ ఒక్కుమ్మారన్నాము.

"ఏకే చదువు చూస్తాము" అన్నాడు విశ్వనాథం. దాసు దానిలో వున్నది యిలా చదివినాడు.

పాదికష్విచి। వ్రాష్యుజా ।హుందుచుమ్ము ళహంతి ।పాహిం లెత్తు। శెబశ । చొందజునసో । పాపిహి జ్ఞరం । చుడిహ్యాసము । షించుబడాస సోపెమ । మిఫీ॥

"ఇది తెనుగంటావు ఏమిటి?" అన్నాడు దాసు.

"కారణం చెప్ప మన్నావా! చూశావా, నారాయణగారి మత్తాశకు ఏంభాషలు వచ్చివుంటవి' తెనుగు, సంస్కృతం, వస్తే హిందీభాషా. ఇది సంస్కృతం కాదు. మనమూ దేశాచారాన్ని అనుసరించి హిందీ చదువుకున్నాము గదా. ఇది ఆభాషలా లేదని నేను చెప్పనవసరం లేదు. ఇక మిగిలింది తెనుగు."

"అర్థం మన్నా లేని ఈవింత శబ్దాలను తెనుగంటావు, నాకు చాలా వింతగా వున్నవి."

"అయితే ఇంకో కారణం చెప్పనా: ఆయనముత్తా

తగారు ఇది రాయడం తమవారికి వినిపించాగపడుతుం దనేగదా, అలాంటివిషయంలో ఉపత్రంమీద తమ మాతృభాష రాసుకోక కోయభాష రాయరుగదా!"

"ఇది కోయభాషను మించినట్లు తోస్తుంది," అని దాసన్నాడు.

"అలా అనకు. ఇది తెలుగనేనమ్మకం. కొంచెం అక్షరాలు ఇటూఅటూ పడ్డాయి. అయినా చూద్దాము కాదూ. అయితే నారాయణగారూ!"

"చిత్తం" అన్నాను.

"మీవుద్దేశం యేమిటి?"

"నావుద్దేశాని కేముంది! తమరు ఉపకారం చేసిపెడితే తమమేలు ఎప్పుడూ మరవను, తరతరాలా చెప్పుకుంటాము. ఎప్పుడూ తమఆజ్ఞకు బద్ధుడనై వుంటాను."

"ఉంటారా! మాట తప్పరుకదా!"

"ఎంతమాట సెలవిచ్చారు!"

"అయితే వినండి. ఈనిధి మీకు దక్కేటందుకు దీనికిటుకు మీకు దొరకాలి. అదే కదా మీరు నన్ను చూడ్డానికి వచ్చిన వుద్దేశం. ఆకిటుకు నేను మీకిస్తాను. మీరు గానుగ రంగయ్యగారి కుమార్తెను వివాహము చేసుకోవాలి!"

"సందేహిస్తారేమి! పిల్ల బాగుండదనా! తాం బ్రాతికలా వుంటుందని మీరే సెలవిచ్చారు. ఆమెకు కళ్ళజబ్బు లేదని మీరే చెప్పారు. ఇంక వంశం మంచిది కాదనా? అదేమిటో చెప్పండి మరి."

"సాంప్రదాయసిద్ధమైనవంశమే నండీ" అన్నాను.

"అయితే సగోత్రం కాదుకద?"

"కాదండి."

"అయితే వప్పుకోండి."

"చిత్తం, తమ సెలవు ప్రకారం జరిగిస్తాను. కాని కిటుకుమాట——"

"ఆవిషయములో మిమ్ములిని మోసంచేస్తానా? మీకు నిధి దొరికినతర్వాతనే తాంబూలాలు పుచ్చుకోడం. పాపం, రంగయ్యగారు సంబంధం దొరకక వూరూరూ తిరిగి మెన్నో పాట్లు పడుతున్నారు మీమూలాన."

"చిత్తం. మీయిష్టానుసారమే——"

"ఇంకోవిషయం. రంగయ్యగారిది బీదకుటుంబం అని మీరే చెప్పినారు. ఈపెండ్లి జరిగినమీదట వారి కుటుంబం నిలబెట్టేభారంకూడా మీమీదే పెట్టవలెనని నాకు వుంది."

"అభ్యంతరం యేమిటండి!"

"అయితే రేపు తమరు దయచెయ్యండి. ఈకిటుకు

చెప్పుతాను. వివాహవిషయంలోకూడా తక్కినసంగతులు మాట్లాడుదాము.”

“చిత్తం” అని నేను భూర్జపత్రపునకలు వారి కిచ్చి పత్రం పట్టుకుని బసకు వచ్చాను.

మరునాడు భోజనముచేసి విశ్వనాథంగారింటికి వెళ్ళినాను. దాసుగారూ విశ్వనాథంగారూ ఏమో మాట్లాడుకుంటున్నారు. నన్ను ఒకకుర్చీమీద కూర్చోమని వారిసంభాషణ సాగించారు.

“రాత్రి అంత టీ తాగితే మరి నిద్ర ఎలావస్తుంది?”

“టీ తాగడంవల్ల కాదోయి. దీనితస్సా గొయ్యా ఈకాగితం ప్రాణాలు తీసింది!”

“అపరాధాలు పరిశోధించడంకన్నా కష్టం అనిపించిందా?”

“సరీ, దానంతకష్టం ఇదీ పెట్టింది.”

“కిటుకు దొరికిందా?”

“మనచేతులో బడ్డాక దొరక్క పోతుందా?”

అప్పుడు నాకు అపరిమితానందం కలిగింది. లక్షాధికారిని అయ్యాననుకున్నాను. వస్త్రాలు కట్టించాలనుకున్నాను. విశ్వనాథంగారికి ఏవేవో చెయ్యాలనుకున్నాను, జ్ఞాపకం లేదు.

“ఏమి టాకిటుకు?”

“వాళ్లకే చెప్తే ఏముంది! దానిపని పోతుంది. ఇలా దగ్గరగా రా. దాని వ్యవహారం చెపుతాను.”

దాసు కుర్చీ దగ్గరకు లాగుకున్నాడు. ఇద్దరూ కాగితం చూస్తున్నారు. ఉండబట్టలేక నేను భూర్జపత్రం తీసి చూడడం మొదలుపెట్టినాను.

“మొదటినుంచీ చెప్పలేదూ, ఇది తెలుగని.”

“తెలుగేనా చివరికి? ఏలా తీశావు కిటుకు మరి చెప్పు. నారాయణగారు ఆదుర్దా పడుతున్నారు పాపం!”

“అయితే విను మరి. ఈ కాగితం ‘నిధికిదారి’ చూపుతుందని భూర్జపత్రం వెనక రాసినమాటలనుబట్టి తెలుస్తూవున్నదికదా. అది జ్ఞాపకం వుంచుకో. ఈ వ్రాత పరిశీలించి చూస్తే ఎక్కడ కక్కడకు పదాలు విభజించి వున్నాయి. మొత్తంమీద పదకొండు పదాలున్నట్టు తేలుతుంది. అందులో నిధి అనేపదం వుంటుందని నీకు తోస్తుందా?”

“వుండవచ్చును.”

“వుండవచ్చును కాదు, వుంది చూడు. ఇందులో రెండక్షరాలపదము చివర వుంది. ‘మిభి.’ ఇది నిధి కావచ్చును. మొదట అనునాసికము ఇత్వముతో కూడి ఉండమువల్ల, రెండవది ఇత్వముతోకూడిన వత్తు అక్షరము అవుటవల్లాను. ఈపదాన్నిబట్టి మన

ము ఇంకొకటి గ్రహించవచ్చు. ఈచీటిలో హల్లులే మార్చినారు కాని అచ్చు లేమీ మార్చలేదని.”

“కావచ్చును.”

“మిథి ఇంతమట్టుకు ‘నిధి’ గా గ్రహించాము. రెండక్షరములు మనకు తెలిసినవి. కాబట్టి మనము ‘మ’ వున్నచోట ‘న’ పెట్టి ‘థ’ వున్నచోట ‘ధ’ పెట్టి చీటి మళ్ళీ రాయవచ్చును.”

“రాస్తే లాభం ఏమిటి?”

“చెబుతా విను. కొంతమట్టుకు మనకు తెలిసింది. కాబట్టి మూడక్షరాల పదం తీసుకుందాము. అది ‘సోఫుమ.’ ‘మ’ అనగా ‘న’ అని మనకు తెలుసును. అప్పుడు ‘సోఫుమ’ అనేది ‘సోఫున’ అవుతుంది. ‘సోఫు’ ఏఅక్షరాలయి వుంటాయి అని ఆలోచించాలి. ‘సోఫున నిధి’ అంటే అర్థం లేదు. చాలాసేపు ఆలోచించిన మీదట ‘సోఫుమ’ అనేది ‘లోతున’ అని నాకు తట్టింది. ఎందుచేత నంటే, డబ్బు పాతినవాళ్లు ఇంతలోతులో పాతినామని చెబితేకాని లాభంలేదు చూడూ.”

“లోతున ఎందుకు కావాలి? పైపున కాకూడదూ?”

“అచ్చులు మారలేదన్నసంగతి నీవు మరిచినావు.”

“సరే.”

“ఇంతమట్టుకు కొంత కిటుకు దొరికింది.

న=ల; వ=త; మ=న; భ=ధ అనీ మనకు తెలిసింది. తరవాత ఇంకోసంగతి. తెలుగులో చాలామార్లు రాతలో వచ్చేఅక్షరాలు ఏమై ఉంటాయి అని ప్రశ్న వేసుకున్నాను. న, వ, ర, త, గ, అని తోచింది. చీటీలో చాలామార్లు వచ్చినఅక్షరాలు ఏమిటి? ఇదిగో, ష, ఆరుసార్లు; ప, హ, మ, ఐదుసార్లూ, డ, జ, త నాలుగుమార్లూ వచ్చినవి. చాలామార్లు వచ్చిన ఈఅక్షరాల బదులు పైన చెప్పినఅక్షరాలు ఇది కాదని అదీ, అది కాదని ఇదీ, పెట్టి తంటాలుపడి మొత్తంమీద 'ష' అంటే 'ర' అనీ, ప హ మ లు త వ న లనీ గ్రహించాను. మొత్తంమీద మనకు ఈఅక్షరాలు తెలిసేయి. న=ల; వ=త; మ=న; భ=ధ; ష=ర; హ=వ. ఈ తెలిసినఅక్షరాలు పెట్టి మళ్ళీ రాసి చూద్దాం ఎలా వుంటుందో.

తాదికర్తి చి। తూర్కృజా। వుందుచున్నరు వంతి। రావిపెత్తు। శె
బత।చొందజావలో రాతివిజ్రవం।చుదివై కునరెందుజడాల।లోతువ।నిధి

"ఇప్పుడు కొంచెం దీనికి తెలుగువాలకం వస్తోంది. కొన్నిముక్కలు నేనుకూడా వూహించి చెప్పగలను సుమా."

"ఆ, అదీ. దారిలో పడుతున్నావు. ఏదీ, నీకు స్ఫురించింది చెప్పు."

“ 'తూర్పుగా వుండుచున్నగుపంటి' అనేది 'తూర్పుగా వుండుకున్నటుపంటి' కాకూడదా!”

“అదే, సందేహం లేదు, కాని ఆఖరు అక్షరం 'త'='ట' అయింది. కాబట్టి ర, టా కాదు. అది వుండుకున్న షుపంటి కావాలి. తరవాత.”

“రెండుజడాల-రెండుగజాలకావచ్చునను కుంటా.”

“సరి, మరి ఇప్పుడు తెలిసిన అక్షరాలన్నీ పట్టీవేసి యిది యెలా రాశారో కిటుకు కనిపెట్టు.” దాసు పట్టీవేసినాడు. కాని తనకు స్ఫురించలే దన్నాడు.

“చూశావూ. కవర్గ అక్షరా లుండవలసినచోట ఏ అక్షరాలు వచ్చేయి?—”

“చవర్గ అక్షరాలు వచ్చినట్లుతోస్తుంది.”

“చవర్గ వుండవలసిన చోటో?”

“టవర్గు. సారి, తెలిసింది! కవర్గుబదులు చవర్గు; చవర్గుబదులు టవర్గు; టవర్గుబదులు తవర్గు; తవర్గుబదులు పవర్గు; పవర్గుబదులు కవర్గు, ఇది తెలుస్తూనేవుంది.”

“మిగిలిన అక్షరాలమాట?”

“యరలవలబదులు శషసహాలు; శషసహాలబదులు యరలవలూను.”

“సరే, నీకు అంతా తెలిసింది.”

“ఈకిటుకు నీవు ఎలా పట్టినావోయి!”

"నారాయణగారి మంత్రాళ వ్యాకరణశాస్త్రవేత్త అ నేసంగతి మరచిపోయావు నువ్వు. అంచేతనే మనను ఇలా బాధపెట్టారు! కానీగాని అదంతా తెలుగులో రాసి శాస్త్రుల్లుగారికి చెప్పు."

"చెప్పడానికేముంది. ఇదిగో."

"తాడిపర్తికి తూర్పుగా వుండుకున్న ఘంటి రావిచెట్టుయొక్క కొండగుహలో రాతివిగ్రహం కుడివైపున రెండుగజాలలోతున నిధి."

నేను కాకితంమీద అంతా రాసుకున్నాను.

"ఏమండీ, నారాయణగారూ! మీకు సంతృప్తిగా వుందా!"

"సరిసరి! ఎంతమాట సెలవిచ్చినారు! ఎప్పటికైనా మీఋణం తీర్చుకోగలనా అని ఆలోచిస్తున్నాను."

3

దాసుగారూ నేనూ కలిసి తిరుగుబండిలో పిఠాపురం వచ్చి ఆరాత్రే బయలుదేరి తాడిపర్తికేసి వెళ్ళినాము. కొంచెం కొంచెం గుడ్డివెన్నెలగా వుంది. రావిచెట్టు క నుక్కున్నాము. దానికి ఎదురుగా కొండ మైలుదూరం

లో వున్నది. అక్కడకు వెళ్ళినాము. గుహ కనుక్కో-
వడంమాత్రం చాలా కష్ట మయింది.

దాసుగారు కుడివైపున వున్నకొండ గుహ బాగా పరీక్షించినారు. అక్కడ గోడకు దాసిపెట్టుకొని చావరాయి వున్నది. అది యువతలకు లాగి నన్ను అక్కడ తవ్వమన్నారు. తవ్వినాను. తవ్వగా తవ్వగా రాగి చెంబు కనిపించింది. ఇంకా గజంలోతు తవ్వి చెయ్యి పెట్టి చూశాను. ఇం కేమీ అవుపించ లేదు. రాగి చెంబుమీద మూత తాపడం చేసివున్నది. విశాఖపట్టణం వెళ్ళి విశ్వనాథంగారియెదట మూత తీయించవచ్చునని దాసు చెప్పితే మాభా గన్నాను.

మూత తీయించి చూస్తే దానిలో బంగారు కణికలు, ముత్యాల హారాలూ, వజ్రాలపతకాలు, కెంపుల పతకాలూ, కానవచ్చినవి. మొత్తంమీద రెండులక్షలఖరీదు వుంటుందని మదింపు వేశారు.

మొదట నా కిష్టం లేక పోయినా రంగయ్య మామగారి కుమార్తె మంచి పనిమంతురాలు కావడంవల్లా, సలక్షణమైన పిల్ల కావడంవల్లా, మంచిగుణాలు కలది —నే చెప్పకో కూడదు— కావడంవల్లా నాకు అదృష్టంవల్ల సమకూడిందని తరవాత అనుకోక తప్పింది కాదు. నాభార్యా నేనూ సిరిసంపదలతో తులతూగుతూ

వున్నాము. అన్నట్టు చెప్పడంమరచిపోయినాను. విశ్వ
నాథంగారికి ఒకతృణం ఇద్దామనిసంకల్పం చేసుకొని ఆ
సంగతి వారితో చెప్పినాను. సుతరాం ఆమాట వారు
విన్నారు కారు. దాసు నాప్రాణస్నేహితుడైనాడు.

మావూళ్ళో దేవుడికి వెయ్యి కొబ్బరికాయలు కొట్టిం
చాను. సుమండీ! లక్షవత్తుల దీపారాధనకూడా చేయిం
చాను. సత్రంమాట ఆలోచిస్తున్నాను.

వూలపిల్లి నారాయణ

వరపు నారాయణశాస్త్రి

౧౯-౨౦